# ఆవిష్కారం

చేతిలో సూట్‌కేస్‌తో బస్ దిగింది లావణ్య.

వెనక నుంచి బస్ దుమ్ము రేపుకుంటూ వెళ్ళిపోయింది.

ఓసారి చుట్టూ చూసింది... ఆ ఊరిని...

దాదాపు పదేళ్ళ తరువాత ఆ ఊరులో అడుగు పెట్టింది.

అదే బస్టాండు... అవే షాపులు...

బైటికి రాగానే కనిపించే కాఫీ హోటలు

అవే అరటి పళ్ళ గెలలు... నిమ్మ సోడాలు...

గుబాళించే మల్లెలు... సంపెంగలు...

ఊరేమీ మారినట్టులేదే..... మనుషుల్లో వచ్చినట్టు త్వరత్వరగా ఊరిలో ఏమీ మార్పులు రావు కాబోలు...

గాలికి ఎగురుతోన్న జుట్టు చేత్తోపైకి తోసుకుంటూ ముందుకి అడుగులు వేసింది.

రిక్షా వాళ్ళు చుట్టూ మూగారు...

బస్టాండుకి తను వెళ్ళబోయే ఇల్లు చాలా దగ్గర.

రిక్షా అనవసరం...

1984లో మొదటి సారి నవ వధువుగా ఆ ఊళ్ళో అడుగుపెట్టింది. 86లో ఆ ఊరినుంచి శాశ్వతంగా వీడ్కోలు తీసుకుంది.

రెండేళ్ళ సాహచర్యంతో ఆ ఊరితో ఇంత అనుబంధం ఏర్పడిందా అనిపిస్తోందిప్పుడు...

మనసు తనకు తెలియకుండానే రెక్కలు చాచి విహంగంలా ఎగురుతోంది...

ఓ జలదరింపు-... ఓ ఆనందకెరటం ....

ఉవ్వెత్తున ఎగసి గుండెల్లో సందడి సృష్టిస్తున్నాయి.

కాళ్ళల్లో తడబాటు... మనసులో గాభరా... మెదడులో ఆలోచనల తుఫాను...

అవేవి తెలీకుండానే అడుగులు ఆ ఇంటి వీధి వైపు పడ్డాయి... ఆ వీధిలో కూడా ఏమీ మార్పులేదు.

ప్రపంచం అంతా మారినా ఈ ఊరు మారలేదే...

ఇల్లు దగ్గరవుతోంది... అడుగులు తడబడుతూ.. గేటు సమీపించింది.

తడిక కాకుండా ఇనపగేటు ఉంటుందేమో అని ఆశించింది... కానీ అదే తడిక - కాకపోతే తడిక కొత్తదిలా ఉంది. కాంపౌండ్ వాల్‌లా చుట్టూ కట్టిన తడిక... దానిపై పాకించిన రకరకాల పూల తీగలు...

వణికే చేతుల్తో తడిక తోసింది...

వీధి వాకిట్లో పేడ కళ్ళాపి జల్లి... అందంగా పేర్చిన ముగ్గులు... గాలిలో పేడ వాసన తేలివస్తోంది.

ముగ్గు తొక్కకుండా, చీరకి పేడ అంటకుండా కొద్దిగా చీర కుచ్చిళ్ళు ఎత్తి పట్టుకొని పక్కనుంచి నడిచి అరుగు ఎక్కింది...

అరుగు మీద కూర్చుని బొమ్మల్తో ఆడుకుంటోంది నాలుగేళ్ళ పాప... ఆ పాప పక్కనే రెండేళ్ళ బాబు... ఆరిందాలా వాణ్ణి ఆడిస్తూంది పాప...

లావణ్య అప్రయత్నంగా వంగి ఆ పాప చెక్కిలి మీటింది...

'' ఎవలు కావాలండి'' ముద్దు ముద్దుగా అడిగింది పాప.

లావణ్య తడబడింది... '' ఆ - నాకు - నాకు... అమ్మ... అమ్మకాదు... తాత.... తాతగారు ఉన్నారా? అడిగింది...

''ఆముక్తా... ఎవరమ్మా?..'' లోపల్నించి ఓ గంభీరమైన కంఠం వినిపించింది.

లావణ్య మనసులో పదేళ్ళ నాటి స్మృతులు ఒక్కసారిగా ఎగిసి పడ్డాయి ఆ కంఠస్వరం వినగానే...

''తాతాలూ... మీరు కావాల్ట... అత్త వచ్చింది..''

లావణ్య చప్పున చేత్తో పాప నోరు మూసి అన్నది...

''అత్త కాదు... తప్పు...''

''మరి? పాప ప్రశ్నార్థకంగా చూసింది.''

''నువ్వు నాకేమవుతావు?'' అడిగింది సీరియస్‌గా -

''నేను... నేను''

ఆగిపోయింది లావణ్య... గుమ్మంనిండుగా నిల్చున్న ఆ ఆకారం చూసి...

''నువ్వా!'' ఆయన కంఠంలో సంభ్రమం...

లావణ్య సూట్‌కేస్ కిందపెట్టి ... రెండు చేతులు జోడించింది...

ఆయన ఏం మాట్లాడలేదు...

ఇద్దరి మధ్యా ఒకలాంటి నిశ్శబ్దం...

''ఏవండీ ఎవరూ వస్తే...'' లోపల్నించి చీర చెంగుతో చేతులు తుడుచుకుంటూ వచ్చింది రాజ్యలక్ష్మి...

లావణ్యని చూస్తూనే - ఓ క్షణం తెల్లబోయినా...

''నువ్వా!... బతికున్నావా?...'' ఆవేశంగా అడిగింది రాజ్యలక్ష్మి...

లావణ్య మాట్లాడలేదు... చీర చెంగు వేలికి చుట్టుకుంటూ నేలచూపులు చూస్తూ నిలబడింది...

''ఏం మహాతల్లీ! ఎవర్ని ఉద్ధరించడానికి వచ్చావు?... ఏం... ఆస్తులేమన్నా పంచుతారేమోనని వచ్చావా?

లావణ్య దెబ్బతిన్న మనసు కళ్ళల్లో ప్రతిఫలిస్తుండగా చివ్వున తల ఎత్తి ఆయన వైపు చూసింది.

''రాజ్యలక్ష్మి -'' మందలింపుగా పిలిచాడాయన.

''అతిథులని ఆదరించడం... మన సంస్కారం... ఇంటికి వచ్చిన వాళ్ళతో మాట్లాడే పద్ధతి ఇది కాదు''

ఆవిడ ఛర్రుమంది.. ''అతిథా! ఇది అతిథా...! ఎవరికి?... మీకా?... నాకా?.. చాల్లెండి...''

''రాజ్యలక్ష్మి...! అమ్మాయిని లోపలికి తీసికెళ్ళు...''

ఆజ్ఞాపిస్తున్నట్టుగా అని లావణ్యతో అన్నాడు

''లోపలికెళ్ళమ్మా-''

ఆవిడకి ఆ ఆజ్ఞ కాదనే సాహసం లేదు...

కానీ అసహనం... బాధ దాచుకోలేక...

''ఇలా నెత్తి నెక్కించుకునే ఈ స్థితి కొచ్చారు... అయినా బుద్ధి రాలేదు... ఖర్మ... ఎవర్నని ఏం లాభం?''

రుసరుసలాడుతూ లోపలికెళ్ళి పోయింది...

లావణ్య కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి...

ఆ ఇంటి కోడలిగా తాను ఇంట్లో అడుగు పెట్టిన దగ్గర్నించీ ఆయన చూపించిన ఆదరణ, ఆప్యాయత... చేసిన గారాబం... అన్నీ ఒక్కసారి గుర్తొచ్చాయి...

ఆడపిల్లలు లేరని తననే ఆడపిల్లగా భావించి... తండ్రిలా మమతానురాగాలు పంచిన ఆయనకి తాను ఇచ్చిన ప్రతిఫలం ఏవిటి? జీవిత కాలానికి సరిపడే మనస్తాపం.

కానీ... తానలా ప్రవర్తించడానికి కారణం ఒక విధంగా ఆయనకూడా కదా!...

''నేను... నేను'' ఏదో చెప్పబోయింది...

''తరవాత మాట్లాడుకుందాం... లోపలికెళ్ళి స్నానం వగైరా కానివ్వమ్మా...'' అన్నాడాయన.

నిశ్శబ్దంగా సూట్‌కేస్‌తో లోపలి గుమ్మంలోకి అడుగుపెడుతున్న ఆమె చెవులకి అమృతప్రాయంగా వినిపించాయి. ఆయన మనవరాలితో అంటోన్న మాటలు... ''తాతలూ! ఆమె నాకు ఏమవుతాలు?''

''పెద్దమ్మ తల్లీ!''

చాలు... ఇది చాలు... ఇన్నేళ్ళ తరువాత అడుగుపెడుతున్న ఆ ఇంట్లో తనకెలాంటి స్వాగతం లభిస్తుందో! ఎలాంటి అవమానాలు భరించాలో!... ఎంత నిరాదరణ సహించాలో! అని రకరకాల ఊహలతో బయల్దేరిన తనకి ఈ ఒక్క మాట కొండంత ధైర్యాన్నిచ్చింది...

హాల్లో అడుగుపెడుతూనే సూట్‌కేస్ ఓమూల పెట్టి... చెప్పులు వదిలి... చుట్టూచూసింది... చేమ్కీ పూల దండతో శ్రీకాంత్ ఫోటో...

శ్రీకాంత్... తన భర్త...

లావణ్య గుండెల్లో దుఃఖం ఘనీభవించి ఓ పెద్ద శిలలా మారి అడ్డం పడినట్లైంది.

ప్రేమించి, ఏరి, కోరి పెళ్ళి చేసుకుని, తనూ సుఖపడక... భార్యనీ సుఖపెట్టక రెండు సంవత్సరాలు ప్రత్యక్ష నరకం చూపించిన పతి...

మామగారి అనునయంతో, అత్తగారి ఆరళ్ళతో, బావగారి అసూయతో... భర్త గారి నిర్లక్ష్యంతో... ఓ సంప్రదాయక కోడలిగా, ఓ సహనశీలిలా, ఓ

సనాతన గృహిణిలా బ్రతకవలసిన తాను... ప్రతి రక్తపు బొట్టులో నిండిపోయిన విప్లవ భావాలతో, చిన్నప్పట్నించీ అలవర్చుకున్న తిరుగు బాటు ధోరణితో రెండేళ్ళకే కాపురాన్ని కాలదన్ని, భర్తతో తెగతెంపులు చేసుకొని, అత్తగార్ని ఎదిరించి, మావగార్ని క్షోభపెట్టి విసిగి... వేసారి గుమ్మందాటి... ఊరుదాటి కన్నవారిని చేరింది...

మధ్యలో ఆపిన చదువు పూర్తి చేసి, గృహిణి పాత్రకి రాజీనామా చేసి ఉద్యోగినిగా మరోపాత్ర పోషించింది...

కాలం గడిచింది... తండ్రి మళ్ళీ పెళ్ళి చేసుకోమన్నాడు. విడాకుల నోటీసు పంపించాడు...

కానీ విడాకులిచ్చి ఆమెని స్వేచ్ఛగా వదిలేయడం నచ్చలేదు శ్రీకాంత్‌కి... అందుకే సంతకం చేయలేదు.

అతను సంతకం చేయకపోడం తన మీద ప్రేమతో అనీ, ఏనాటికైనా మారి, తనని తప్పక తిరిగి తీసికెళ్తాడని నమ్మింది...

కానీ కాలం గడిచాక తెలిసింది... అది కేవలం తనమీద పగసాధించడానికని.

అతను మాత్రం మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు...

తల్లి కోరిక మేర... ఆ వంశం నిలవడం కోసం పిల్లల్ని కూడా కన్నాడు...

కానీ దురలవాట్లు మాన లేదు... ఫలితం...

లావణ్య కళ్ళల్లో ఎందుకో ప్రయత్నించినా రాలలేదు ఓ కన్నీటి బొట్టు...

''వాడు పోగానే వస్తావనుకున్నాను... కనీసం ఆఖరి చూపన్నా చూసేదానివి...''

లావణ్య తల తిప్పేసుకుని అన్నది...

''కబురందింది... కానీ వచ్చి ఏం చేయాలో అర్థం కాలేదు..''

''ఇప్పుడు మాత్రం ఏం చేయగలవు? వెళ్ళు... వెళ్ళి స్నానం చేయి! గంగా!... అక్కయ్యకి బాత్రూం చూపించు...''

అవధానిగారి కంఠం వింటూనే చెంబులో నీళ్ళతో వచ్చింది గంగ... ఎర్రంచు తెల్లచీర... తెల్లని తెలుపు... బొట్టు లేని మొహం... పరిశీలనగా చూస్తోంటే అన్నాడాయన...

''నా కోడలు...''

గుండెల్లో ముల్లు గుచ్చుకున్నట్లైంది.

మూడు పదులు దాటని వయసు. (శ్రీకాంత్‌కన్నా బహుశా పది పన్నెండేళ్ళు చిన్నది కావచ్చు). ఇంత చిన్నపిల్లనా పెళ్ళి చేసుకున్నాడు.

వినయం, అణకువ ఉట్టిపడుతూ రాజ్యలక్ష్మిగారి ఆశలమేరకు రూపు దిద్దుకున్న సాధ్వీమణిలా ఉంది.

ఈమె సాంగత్యంలో అత్తని కోరిక, అంటే భార్య బానిసలా పడి ఉండాలనే కోరిక తీరి ఉంటుంది.

కోడలంటే ఇంటిల్లిపాదికీ సేవలు చేసేది, పిల్లల్ని కని వంశం నిలిపేది, ఇంట్లో ఎన్ని అన్యాయాలు, జరిగినా నోరు మెదపకుండా సహించగలిగేది అయి ఉండాలన్న రాజ్యలక్ష్మి గారి కోరిక.

తోడికోడలంటే తన చెప్పుచేతల్లో ఉండాలనే పైశాచిక మనస్తత్వం కలిగిన అక్కగారి ఆశా, తమ్ముడు భార్య, తన భార్యకి జీతంలేని పనిమనిషి కావాలన్న బావగారి ఆరాటం... అన్ని విధాలా వాళ్ళకు నచ్చిన అమ్మాయి గంగ...

పాపం!... ఈ పిల్ల భవిష్యత్తు ఏమిటో! గుండెల్ని చీల్చుకుంటూ వస్తోన్న నిట్టూర్పు అణచుకుంటూ బాత్రూం వైపు నడిచింది...

''తగుదునమ్మా అని ఎందుకొచ్చినట్టు... మొగుడు పోయాడని తెలుసుగా... మరి ఆ అలంకారాలు ఏవిటి?... మళ్ళీ పెళ్ళి చేసుకుందేమో!...''

తోడికోడలు... తార స్వరం... ఎన్నేళ్ళైనా గుర్తు పట్టగలదు...

''అందుకేగా మొగుడ్నొదిలి వెళ్ళింది. విచ్చలవిడిగా తిరగడానికి అలవాటు పడ్డ వాళ్ళకి మొగుడెందుకు? సంసారం ఎందుకు? అవ్వ... ఆ షోకేవిటి? అత్తగారి నొక్కులు...

''లేనిపోని తద్దినాలని నెత్తినేసుకోవడం ఈయనకి బాగా అలవాటైంది... పదేళ్ళయ్యాక ఎందుకొచ్చిందిట... కనీసం వాడు పోయాక ఆఖరి చూపుకైనా రాలేదు... ఆస్తులేమన్నా పంచుతారని వచ్చిందేమో! మనకేం సంబంధం లేదని చెప్పండి...'' బావగారి ఆదేశాలు...

లావణ్య కామ్‌గా బాత్రూంలోకెళ్ళిపోయింది.

స్నానం కానిచ్చి వచ్చేటప్పటికి గంగ చిక్కటి కాఫీ ఇచ్చింది.

పలకరిస్తే ముభావంగా సమాధానం చెప్పి తప్పించుకుని వెళ్ళిపోతోంది.

సాయంత్రందాకా అవధానిగారు అడపా తడపా పలకరిస్తూ, గంగ కాఫీ, టిఫిన్, భోజనాల ఏర్పాటు చేయడంతో... గడిచిపోయింది... మిగతా వాళ్ళెవరూ పలకరించలేదు...

కొంచెం బాధనిపించినా, ఎప్పుడో అలవాటు పడిన ఈ చిరాకులూ, చీదరలూ, సూటిపోటీ మాటలు కొత్తగా బాధపెట్టలేదు. నిజానికి తనిక్కడికి రావడం తప్ప...

కానీ నెల క్రితం చనిపోయిన శ్రీకాంత్ జ్ఞాపకాలన్నా తనతో ఉంచుకోటానికి... వాటి కోసం వచ్చింది.... పెళ్ళి బట్టలు... అతను వ్రాసిన ప్రేమలేఖలు... అన్ని కలిసిన ఓ పెట్టి ఇక్కడే ఉండిపోయింది. మనిషిపోయినా అతని జ్ఞాపకాలు కొన్ని తన వెన్నంటే ఉన్నాయి.

అతనెప్పటికైనా మారతాడని ఓ చిన్న ఆశాకిరణం వెలుగులో నిరీక్షించింది... నిరీక్షణలో ఎంతకాలం గడిచిందో- తెలిసేటప్పటికి కాలాతీతమైంది.

''నువ్వు మళ్ళీ పెళ్ళి చేసుకున్నావనుకున్నాను.'' లావణ్య ఉలిక్కిపడింది.

అవధానిగారు అరుగు మీద ఓ ప్రక్కగా కండువా పరుచుకుని కూర్చుంటూ అన్నారు.

''ఆ అవకాశం ఇవ్వకూడదనేగా మీ అబ్బాయి విడాకుల కాగితం మీద సంతకం చేయలేదు.''

''కానీ విడాకులు తీసుకోకపోయినా, వాడు పెళ్ళి చేసుకున్నాడుగా...''

''అదే పురుషాహంకారం అంటే...'' అనాలనుకుంది.

కానీ, ఇన్నేళ్ళ తరువాత కనిపించిన, ఆయన మనసు గాయం చేయాలనిపించలేదు.

''ఆ ఆలోచన మనసుకి తట్టేటప్పటికి వయసు దాటి పోయింది'' అన్నది.

''నిన్ను కన్న కూతురిలా చూసినందుకు, ఈ చివరి రోజుల్లో ఓసారి కన్పించావు. చాలా సంతోషం...''

ఆయన కళ్ళల్లో నిజమైన ఆనందంతో కూడిన కాంతి.

''మీకారోజు మాట ఇచ్చాను కన్పిస్తానని. కానీ అవకాశమే దొరకలేదు... ఆ అవకాశం నాకు నేనుగా ఏర్పరచుకోడానికి కొన్ని స్మృతులు ఇక్కడే వదిలి

వెళ్ళాను. అయితే ఇంతకాలం ఏదో నిరీక్షణతో గడిపినందుకేమో వాయిదా వేస్తూ వచ్చాను... ఇప్పుడింక నిరీక్షణ అవసరం లేదుగా...''

''వాడు పోగానే టెలిగ్రాం ఇచ్చాను - ఆఖరు చూపన్నా చూస్తావని. విడాకులు తీసుకోలేదు కాబట్టి నిన్ను పరాయి దానిగా భావించలేకపోయాను.''

''ఆ భావం మీకు మాత్రమే ఉంది... అందుకే ఇన్నాళ్ళైనా మీకు ఇంకా నామీద అభిమానం మిగిలి ఉన్నందుకు ధన్యురాల్ని.''

''ఇంత అనుబంధం పెంచుకున్న దానివి, అలా ఎలా వెళ్ళిపోగలిగావు లావణ్యా?''

లావణ్య మాట్లాడలేదు. నిజానికీ ప్రశ్నకి సమాధానం లేదు... కాని ఏదన్నా చెప్పాలనిపించింది. తన తరపున కాకున్నా - తనలాంటి చాలామంది స్త్రీల తరపున.

''ఆడది భర్తనీ, మెట్టింటినీ, అత్త మామల్ని వదిలి వెళ్ళి పోవడమంటే కేవలం వ్యక్తుల్ని వదిలి వెళ్ళడం కాదు మావయ్యగారూ! గౌరవనీయమైన జీవితాన్ని, అనుబంధాలను వదలి వెళ్ళడం. ఏదో విశృంఖలంగా జీవించాలనీ, విచ్చలవిడిగా తిరగాలనీ, ఒంటరిగా బ్రతకాలనీ ఏ స్త్రీ కోరుకోదు. పరిస్థితులు... అంతే... అనుబంధాలతో పాటు కొంత ఆప్యాయతనూ, భర్త నుంచి కొంత అనురాగాన్ని, గౌరవాన్ని... తనకో ఉనికిని తన వ్యక్తిత్వానికి రక్షణ కోరుకుంటుంది... తనో యంత్రంలా కాక తనకో ఆస్తిత్వాన్ని ఆశిస్తుంది... అది మృగ్యమైనప్పుడు వాటిని వెతుక్కుంటూ వెళ్లడంలో తప్పుంటుందా? ఆత్మాభిమానం ఉన్న స్త్రీ ఓ బానిసలా పడి ఉండగలదా? నా ఎడబాటు ఆయనలో పరివర్తన తీసుకు వస్తుందని ఆశించాను... ఆవేశం, ఆవేదన మిళితమైన స్వరంతో అన్నది లావణ్య.

''భర్త దగ్గర ఆత్మాభిమానం ఏవిటమ్మా... ఒకరి కోసం ఒకరు కొన్ని ఆనందాలనూ, ఆశయాలనూ, కోరికలనూ, వ్యక్తిత్వాన్ని కొంతన్నా త్యాగం చేస్తేనేకదా! దాంపత్య జీవితానికి అర్థం.''

''ఒకరి కోసం ఒకరు - అని మీరే అంటున్నారు. కానీ రెండేళ్ళు నేనే కదా ఆయనకోసం ఎన్నో త్యాగం చేశాను... నాత్యాగానికి ఏం గుర్తింపు లభించింది? ఆయన నాకోసం ఏం చేశారు? ప్రేమించి పెళ్ళి చేసుకుని తన తల్లికి ఓ పనిమనిషిని... తనకో వేశ్యని మాత్రమే తెచ్చుకున్నారు - నా

మనసు ముక్కలు చేశారు. నా జీవితాన్ని ఎడారిగా మార్చారు.''

''లావణ్యా! ఆవేశంలో నాతో మాట్లాడుతున్నానన్న విషయం మర్చిపోతున్నావు.'' మందలించాడాయన.

''క్షమించండి...'' తన మాటల్లో ఆవేశం తాలూకు పదాలు గమనించి అన్నది.

''మీరు ఆధునికత, నాగరికత అంటూ చిన్న, చిన్న విషయాల్ని భూతద్దంలో చూసి భయపడుతున్నారు. మీ అత్తయ్య భరించినన్ని బాధలు నువ్వేం భరించావు.'' నేనేనాడు, ఆవిడ మాటలకి కానీ, ఆలోచనలకి కానీ గడ్డి పోచ విలువ కూడా ఇవ్వలేదు.

మా అమ్మ ఆవిడ్ని రాచిరంపాన పెట్టేది. అన్నీ భరించింది. కాబట్టి ఈ నాడు భర్త, పిల్లలు... కోడళ్ళు, అల్లుళ్ళు, మనవళ్ళు, మనవరాళ్ళుతో కళకళలాడే కుటుంబానికి యజమానురాలు కాగలిగింది. మాది గౌరవనీయమైన కుటుంబంగా సమాజంలో ఓ స్థానాన్ని సంపాదించుకుంది.

''సమాజంలో స్థానం కుటుంబాలకే కానీ, వ్యక్తులకు లేదంటారా మావయ్యా!''

ఆయన సమాధానం చెప్పలేదు. ఏం చెప్పగలడు!

లావణ్య రాజ్యలక్ష్మి కాదు. ఒకప్పుడు స్త్రీలంతా రాజ్యలక్ష్మిలే... కానీ ఈ కాలంలో ఎందరో లావణ్యలు... కొందరే రాజ్యలక్ష్మిలు. ఆ కొందరిలో ఒక గంగ ఉండ బట్టి ఈ ఇంటి కోడలిగా సుస్థిర స్థానాన్ని సంపాదించుకోగలిగింది.

లావణ్య మళ్ళీ అన్నది.

''మీరు మీ స్వార్థం కోసం, అత్తయ్యని మీచేతి పనిముట్టుగా తయారు చేసుకున్నారు. ఆవిడ ఆలోచనలు, భార్య అంటే బానిస అన్న స్థాయినుంచి ఎదక్కుండా జాగ్రత్త పడ్డారు. నరనరానా జీర్ణించుకున్న ఆ భావాన్ని, ఆ తత్వాన్ని ఆవిడ కోడళ్ళలో చూడాలనుకున్నారు. కానీ దురదృష్టం మీదో, నాదో నాకు తెలియదు... నేను మాత్రం ఆవిడ ఆశలమేరకు నన్ను మలచుకోలేకపోయాను. బహుశా ఇందులో తప్పు మీ అబ్బాయిదే అనుకుంటా. చదువుకున్న, నవ నాగరిక యువతినైన నన్ను ప్రేమించి పెళ్ళి చేసుకునే కన్నా ముందే గంగలాంటి అమ్మాయిని చేసుకుని ఉండే రెండో

పెళ్ళి అవసరం కలిగేది కాదు. ఏది ఏమైనా గంగను పెళ్ళి చేసుకుని ఆయన కోరికా, వాళ్ళమ్మ కోరికా తీర్చారు... ఈ రోజు గంగ కేవలం గృహిణిగా, శ్రీకాంత్ భార్యగా, రాజ్యలక్ష్మిగారి కోడలిగా మిగిలిపోయింది.''

''లావణ్యా! వయసుతో పాటు నీ ఆలోచనల్లో కూడా పదును పెరిగింది. అప్పుడు చిన్నపిల్లవి కాబట్టి ఆవేశ పడుతుంటే అనునయించి కంట్రోల్ చేయగలిగాను. కానీ ఇప్పుడు పెద్దదానివి అయినావు. పైగా రచయిత్రివి. నీ వివేకం, విజ్ఞత ముందు నేనేపాటి?''

''అంత మాటనకండి మావయ్యా. మీరెప్పుడూ నాకు పితృసమానులే...'' కలవరంగా అన్నది.

''పోనీలేమ్మా... జరిగిందేదో జరిగిపోయింది.

ఇప్పుడు గతం తవ్వుకుని బాధపడితే ప్రయోజనం ఏం ఉంది? నువ్వు ఇవాళ వచ్చిన కారణం చెప్పలేదు...'' మృదువుగా అడిగాడాయన.

లావణ్య నిట్టూర్చి అన్నది.

''ఇక్కడికి కేవలం మీ కోసమే వచ్చాను. అసలు విజయవాడలో దిగాల్సింది. రేపు నా పుస్తకం ఒకటి విజయవాడలో ఆవిష్కరించబడుతోంది - పుస్తకం పేరు ''బతుకులు''...''

''అంటే నీ బ్రాండ్ పుస్తకమేనా! విప్లవం, అభ్యుదయం - స్త్రీ స్వేచ్ఛ...''

''అవును... అలాంటిదే. విజయవాడలోనే పబ్లిష్ చేయించాను...''

''అయితే రేపు వెళ్ళిపోతావన్న మాట'' ఆయన కంఠంలో అస్పష్టమైన బాధ...

అచేతనురాలైంది లావణ్య.

ఎన్నాళ్ళైనా... ఎన్నేళ్ళైనా చెక్కుచెదరని వాత్సల్యం.

ఏ నాటిదీ బంధం! ఎందుకీయనకి ఇంత అభిమానం!

''వాడు పోయినప్పుడు రాలేదు... ఎలాగూ వచ్చావుగా... మాసికానికి ఉంటావనుకున్నాను...''

''మీకు తెలుసుగా... నాకా నమ్మకాలు లేవని...

ఈ పుస్తకం ఒకనాటి ఆయన భార్యగా ఆయనకే అంకితం చేస్తున్నాను.''

''నీ ప్రేమ ఇలా చాటుకుంటున్నావా?''

''కాదు... జీవితాంతం నా పేరు ముందు శ్రీమతి అని తగిలించుకునే

అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞత తెలుపుకుంటున్నాను.''

''నీతో ఎప్పుడూ మాటల్లో గెలవలేను కదమ్మా!''

కొన్ని క్షణాలు ఇద్దరి మధ్యా నిశ్శబ్దం రాజ్యం చేసింది.

చీకట్లు ముసురుకున్నాయి. మొక్కల మీంచి చల్లగాలి వీస్తోంది. ఇంటిల్లిపాదీ పెరట్లో కూర్చున్నారు. మధ్య మధ్యలో పాప, బాబుల అల్లరి వినిపిస్తోంది.

''మావయ్య గారూ! మిమ్మల్ని ఓ మాట అడగాలనుకుంటున్నాను'' నిశ్శబ్దాన్ని చీలుస్తూ అన్నది లావణ్య.

''అడుగమ్మా... నీకడ్డేమిటి?'' ఆప్యాయంగా అన్నాడాయన...

కొన్ని క్షణాలు మౌనంగా ఉండి - అన్నది.

''గంగ భవిష్యత్తు ఏం ఆలోచించారు?'' త్రుళ్ళిపడ్డాడాయన.

''ఇద్దరు పిల్లల తల్లి... మా దగ్గర మా సంరక్షణలో ఉంటూ ఆ పిల్లల్ని పెద్ద చేయడమే గంగకున్న బాధ్యత. ఇంక వేరే భవిష్యత్తేమిటి?''

''ఎంత అన్యాయం!... మీ సంరక్షణలో కాదు తనున్నది... మీ పంచన...''

''లావణ్యా!...''

''కోపం వద్దు మావయ్యగారూ! సందర్భం వచ్చింది కాబట్టి, మీ దగ్గర నాకు చనువుంది కాబట్టి అడుగుతున్నాను. మూడు పదులు కూడా దాటని ఆ పిల్ల అలా మీ ఇంటిల్లపాదికీ సేవలు చేస్తూ, మీరు పెట్టింది తింటూ బ్రతకాల్సిందేనా!

''లావణ్యా! నువ్వు చేసిన పనికే ఈ కుటుంబం ఎంత అల్లరి పాలైందో నీకు తెలియదు. మీ అత్తయ్య కుమిలి కుమిలి... ఈ మధ్యే కాస్త మనుషుల్లో పడుతోంది. మన సంప్రదాయం, ఆచారం వీటికి విరుద్ధమైన పనిచేసి, ఈ ఇంటి కోడలిగా కళంకం తెచ్చావు. గంగనన్నా మా ఇంటి పరువు ప్రతిష్ఠలను నిలపనీ...'' కొంచెం ఆగ్రహంగా అన్నారాయన.

''మీ ఇంటి పరువు ప్రతిష్ఠలు నిలవడం కోసం విలువైన ఆడపిల్ల జీవితం బలికావలసిందేనా? కంప్యూటర్ యుగంలో బ్రతుకుతున్నాం... శాస్త్ర విజ్ఞానం ఎంతో పెరిగి రేపో, మాపో మనిషి చంద్ర మండలం మీద స్థిరనివాసం ఏర్పరచుకోబోతున్న ఈ తరుణంలో కూడా మీ ఆలోచనా దృక్పథంలో మార్పురాలేదు. ఇంతకన్నా విషాదం ఉందా? మీ అబ్బాయి సంగతి తెలిసీ,

ఓ ఆడపిల్ల అతణ్ణి భర్తగా భరించలేక పారిపోయినా, నిస్సహాయురాలైన మరో ఆడపిల్లని నిర్దాక్షిణ్యంగా అతని జీవితంలో ప్రవేశపెట్టారు. కేవలం మీకో వంశాంకురం అందించడానికి ఆమెని బలిచేశారు... ఇప్పటికైనా ఆమె భవిష్యత్తుకో బాట వేసి, మీ విశాల హృదయం చాటుకోండి.''

ఆయన అవాక్కైనాడు. ఏవిటి లావణ్య అనేది!

ఏం చేయమంటోంది తనని!

''ఏం చేయమంటావు లావణ్యా!'' వణికే కంఠంతో అడిగాడు.

''భయపడకండి మావయ్యా. ముందు ఆమెకి తన కాళ్ళ మీద తాను నిలబడగల శక్తిని, స్థైర్యాన్ని ప్రసాదించండి... ఆర్థికంగా ఆమెకి స్వాతంత్ర్యం కల్పిస్తే జీవితాంతం, మీ దయాదాక్షిణ్యం మీద ఆధారపడి బ్రతకవలసిన అవసరం ఉండదు కదా! ఇది లావణ్యగా నా సలహా.''

అవధానిగారి తల మీద సమ్మెటతో కొడుతున్నట్లైంది ఇది ఎలా సాధ్యం! కొన్ని నిమిషాల తరువాత ధృడంగా అన్నాడు.

''ఈ ఇంటికి కొన్ని నియమాలున్నాయి... కొన్ని పద్ధతులు ఉన్నాయి. వాటిని నువ్వెలాగా సమాధి చేశావు. గంగని అలా బ్రతకనీ లావణ్యా... దాని మనసు పాడు చేయకు... పడుకో బాగా పొద్దు పోయింది.'' అంటూ లేచి కండువా దులిపి మీద వేసుకుని బైటికెళ్ళిపోయాడాయన.

లావణ్య నిట్టూర్చింది.

★ ★ ★

తెల్లవారింది. నిద్రలేచిన లావణ్య గబగబా కాలకృత్యాలు తీర్చుకుని, స్నానంచేసి బయల్దేరింది.... గంగ కాఫీ తెచ్చి ఇచ్చి మౌనంగా లోపలికెళ్ళి పోయింది.

పిల్లలు లేచారేమో ఒక్కసారి దగ్గరకి తీసుకుని వాళ్ళకేవన్నా ఇవ్వాలనుకుంది. కానీ పిల్లలు లేవలేదు. రాజ్యలక్ష్మి గారైతే నిన్నటినుంచీ పలకరించలేదు... మొక్కుబడిగా అన్నం పెట్టింది... అది అవధానిగారి భయంతో... మిగతా వాళ్ళెవరూ మాట్లాడరని తెలుసు. గంగ ఓ యంత్రంలా పనులు చేయడం తప్ప మాట్లాడగా వినలేదు.

లావణ్య కాఫీ త్రాగుతూ ఆలోచిస్తూ తన రాకకి ఆనందించి, వెళ్తోందని విచారించే ఒకే ఒక వ్యక్తి కోసం చూస్తోంది... కానీ ఆయన కనిపించలేదు...

లావణ్యా గ్లాసు కిటికీలో పెట్టి లోపలికి తొంగి చూస్తూ, ''గంగా'' అని పిలిచింది.

గంగ బైటికి వచ్చింది.

''మావయ్యగారు లేరా?''

''లేరు... గుడికెళ్ళారు...'' గంగ చాలా సౌమ్యంగా జవాబిచ్చింది.

''ఎప్పుడొస్తారు? ఏవన్నా చెప్పారా?''

''లేదు... మీకది ఇవ్వమన్నారు'' వేలితో ఓ మూలగా పెట్టిన చిన్న ఇనప్పెట్టె చూపించింది.

లావణ్యకి షాక్ తగిలినట్లైంది.

అదే తను ఆ ఇంట్లో వదిలేసి వెళ్ళిన స్మృతుల ఖజానా... అది ఇక్కడ పెట్టారంటే...

''ఇంక సెలవు... వెళ్ళిరా'' అని తనకి ఆయన శాశ్వతమైన వీడ్కోలు పలికినట్టేనా!...

లావణ్య గుండెల మీద సమ్మెటతో కొట్టినట్లైంది.

ఇంత కాలానికి మొదటి సారి అవధాని గారు తన పట్ల చూపించిన నిరాదరణ...

తట్టుకోలేకపోయింది...

ఆ పెట్టె ముట్టుకోలేదు. అది ఇక్కడ వదిలేసిన కారణం వేరు...

అవధానిగారి కోరిక తీర్చటానికి తను మరోసారి ఈ ఇంటికి రావాలంటే అదే వంక పెట్టి దాని కోసం వచ్చానని చెప్పచ్చు అనుకుంది...

కానీ, ఇప్పుడా అవసరం లేదన్న మాట...

ఇంకెందుకీ స్మృతులు...

సూట్‌కేస్ తీసుకుని చకచకా బస్టాండ్ చేరింది. మనస్సు ముక్కలవుతున్నట్లుగా అనిపించింది. విషాదంతో నిండిన హృదయం భారంగా ఉంది... కన్నీళ్ళు ఘనీభవించాయి...

ఏ ఆప్యాయత తనకీ, ఆ ఇంటికీ వంతెన వేసి ఇంతకాలం దూరమైనా ఈనాడిలా రానిచ్చిందో... ఆ ఆప్యాయత తను కోల్పోయాక ఈ ఊరితో, ఈ ఇంటితో పూర్తిగా అనుబంధం తెంచుకున్న ఆనాటికన్నా... ఈనాడు ఆవేదన ఎక్కువైంది. ఆనాడు మళ్ళీ ఎప్పటికైనా వస్తానన్న ఆశ... కానీ

ఈనాడు?...

బస్సు వచ్చింది...

భారంగా కదిలి ఫుట్‌బోర్డ్ కడ్డీ పట్టుకుని బస్సు ఎక్కబోయిన లావణ్యా తన భుజం మీద బరువుగా ఓ చేయి పడటంతో చివ్వున తిరిగి చూసింది

ప్రశాంతమైన ముఖంతో అవధానిగారు... ఆయన ప్రక్కనే చేతిలో సూట్‌కేసుతో గంగ...

స్థాణువైపోయింది లావణ్య...

''మావయ్యా... మీరు...''

అవధాని గంభీరంగా నవ్వాడు.

''నేనేనమ్మా... రాత్రంతా ఆలోచించి... ఆలోచించి... నేను చాలా స్వార్థపరుడ్నన్న నిజం గ్రహించాను... నా స్వార్థం కోసం గంగ జీవితం ఇప్పటికే నాశనం చేశాను... ఇంక అలా జరగకూడదు, ఈ అమాయకురాలికి సరైన గైడ్‌వి నువ్వే. అందుకే నీకు అప్పగించాలని వచ్చాను...''

''నేను... నేను... ఈ వాస్తవాన్ని నమ్మలేకపోతున్నాను. మరి పిల్లలు...'' అయోమయంగా అడిగింది.

''పిల్లలు... నా వంశం కోసం కదమ్మా... వాళ్ళ బాధ్యత నేను బ్రతికున్నంత కాలం నాదే...''

''పొరపాటు మావయ్యా... పిల్లలు వంశం కోసమైనా తల్లి పిల్లల కోసమే... ఈ నిజం మర్చిపోకండి. గంగ తనకంటూ ఓ జీవితాన్ని ఏర్పరచుకునే దాకా వాళ్ళ సంరక్షణ భారం మీదే...''

''లావణ్యా! ఆ రోజు నువ్వీ ఇంటినుంచి వెళ్ళిపోతూంటే... ఆవేశంలో ఆలోచన మరచి వెళ్ళిపోతోంది... గౌరవనీయమైన, భద్రత గల, జీవితాన్ని కాలదన్నుకుంటోంది... ఎన్ని బాధలు పడుతుందో! ఏం చేస్తుందో అని మధన పడ్డాను. కానీ సాహసించి వెళ్ళినందుకు ఎంతో ఉన్నత శిఖరాల్ని అధిరోహించడమే కాక, నీ రచనలతో మరెందరికో స్ఫూర్తినిస్తున్నావు. బహుశా ఆనాడలా నువ్వు వెళ్ళకపోయి ఉంటే ఈనాటి గంగ స్థానం నీదై ఉండేది. అందుకే అప్పటి నీ నిర్ణయాన్ని నేనీనాడు మనస్ఫూర్తిగా హర్షిస్తున్నానమ్మా...'' ఆయన కళ్ళల్లో రెండు భాష్పాలు.

''అదృష్టవంతురాలిని మావయ్యా... గంగని పూర్తి వ్యక్తిత్వం నిండిన

స్త్రీగా మీకు అప్పగిస్తాను మీ కోడలిగా...''

''నా కోడలిగానే నేను కావాలని ఆశిస్తే, అది మళ్ళీ నా స్వార్థమే అవుతుంది... నా కూతురిగా ఆహ్వానిస్తాను...''

లావణ్య హృదయం ఆయన ఔన్నత్యానికి అభివాదం చేసింది మౌనంగా.

''అప్పుడా కూతురి జీవితం ఏం చెయ్యాలో నిర్ణయించే భారం మీదే అవుతుంది మావయ్యా'' అన్నది...

''నేను అందాకా బ్రతికుంటే తప్పక గంగకో అందమైన బ్రతుకునిస్తాను. అందాకా ఈమె బ్రతుకు పుస్తకం నీకిస్తున్నాను... దీన్ని తిరగ రాసి ఆవిష్కరించే బాధ్యత నీదే...'' గంగ చేయి లావణ్య చేతిలో పెట్టాడు...

''ధన్యురాలిని...'' అన్నది లావణ్య.

బస్ ఎక్కమన్నట్టుగా బెల్ కొట్టాడు కండక్టర్. గంగ వంగి ఆయన పాదాలకు నమస్కరించింది...

''వస్తాను మావయ్యా'' లావణ్య చేతులు జోడించింది.

''శుభమస్తు...'' అన్నాడాయన నిండుగా ఇద్దరినీ దీవిస్తూ...

దుమ్మురేపుకుంటూ కదిలిన బస్‌లోంచి ఊపుతున్న లావణ్య చేయి కన్నీటి పొరల మధ్య అస్పష్టంగా అయినా అభయహస్తంలా కన్పించిదాయనకి...